మలక్‌పేటలోని డిస్పోజల్ గ్లాసుల గోదాంలో అగ్ని ప్రమాదం

మలక్‌పేట, నవంబర్ 19: మలక్‌పేట మహబూబ్ మ్యాన్షన్ మార్కెట్ (గంజ్)లోని ఓ డిస్పోజల్ గ్లాస్‌ల (పేపర్ గ్లాస్) గోదాంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించి సామగ్రి మొత్తం కాలిపోయింది. ఈ ఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. జిల్లా అదనపు ఫైర్ అధికారి షణ్ముఖ రావు, మలక్‌పేట అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి అంజిరెడ్డి కథనం ప్రకారం.. మంగళవారం తెల్లవారు జామున మలక్‌పేట మహబూబ్ మ్యాన్షన్ మార్కెట్‌లోని ప్రైమ్ ఎంటర్‌ప్రైజెస్ (డిస్పోజల్ గ్లాసుల) గోదాంలో మంటలు ఎగిసిపడటాన్ని గమనించిన స్థానికులు వెంటనే మలక్‌పేట అగ్నిమాపక కేంద్రానికి, చాదర్‌ఘాట్ పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడికి చేరుకున్న జిల్లా అదనపు ఫైర్ అధికారి షణ్ముఖరావు, మలక్‌పేట అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి అంజిరెడ్డి మూడు ఫైరింజన్ల సహాయంతో సుమారు రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే సామగ్రి మొత్తం కాలిపోయింది. గోదాం ముందున్న చెత్తకుప్పలో గుర్తు తెలియని వ్యక్తులు సిగరేట్ కాల్చి పడేసి ఉంటారని, ఆ మంటతో వచ్చిన నిప్పురవ్వలు ఎగిసి గోదాంలో పడటంతో ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు. గోదాంలో సుమారు రూ.20 లక్షల విలువజేసే డిస్పోజల్ పేపర్ గ్లాసులు కాలిపోయాయని నిర్వాహకులు శైలేశ్, రాజేశ్ అగర్వాల్ తెలిపారు. ఈ మేరకు నిర్వాహకులు చాదర్‌ఘాట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో ఆస్తి నష్టం పేర్కొనలేదని ఎస్ఐ భరత్‌కుమార్ తెలిపారు. ఘటనా స్థలాన్ని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మీ, వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, డైరెక్టర్లు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి, ఉప సంచాలకులు దామోదర్, గ్రేడ్ కార్యదర్శి చిలక నర్సింహారెడ్డి, చాదర్‌ఘాట్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ (డీఐ) సైదులు తదితరులు సందర్శించారు.

ప్రశ్నిస్తే నిర్బంధం!

సోషల్ మీడియాలో పోస్టులు పెడితే అక్రమ కేసులు

కోర్టులు మొట్టికాయలు వేస్తున్నా మారని పోలీసుల తీరు

బాస్‌ల మెప్పు కోసం దేనికైనా సిద్ధం

కక్ష సాధింపు చర్యలకు పోతూ అబాసుపాలవుతున్న సైబర్‌క్రైమ్ పోలీసులు

సిటీబ్యూరో, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే పోలీసులు వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. అలాంటి వారిని నిర్బంధించేందుకు ప్రయత్నిస్తున్నారు. సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎలాంటి పోస్టులొచ్చాయని ఆరా తీసి.. మరీ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. వాక్ స్వాతంత్ర్యం అనేది రాజ్యాంగం ఇచ్చిన హక్కు. ప్రభుత్వం మంచి చేసినప్పుడు బాగుందని చెప్పడం, ప్రజా వ్యతిరేక నిర్ణయాలు చేసినప్పుడు అది బాగోలేదని చెప్పడానికి నేడు ప్రతి ఒక్కరూ సోషల్‌మీడియాను వాడుకుంటున్నారు. ప్రభుత్వం తెచ్చే పథకాలు, నిర్ణయాలు, అభివృద్ధి, పాలన ఇలాంటి విషయాల్లో ప్రభుత్వం దారి తప్పినప్పుడు ప్రజలు దానిని ఎత్తి చూపుతున్నారు. ఇది జీర్ణించుకోలేని అధికారి పార్టీ నాయకులు పోలీసులపై ఒత్తిడి తెస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలోనే సోషల్‌మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టినా, మాట్లాడినా కేసులు బనాయిస్తూ.. పోలీసులు దౌర్జన్యానికి దిగుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

న్యాయస్థానాలు చెబుతున్నా!

సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టారని, దాని వల్ల శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతాయంటూ పోలీసులు ఇష్టానుసారంగా కేసులు నమోదు చేస్తున్నారు. సోషల్ మీడియాలో ప్రభుత్వానికి, నాయకులకు వ్యతిరేకంగా పోస్టులు పెడితే ఆ పోస్టును సమర్థించేవారుంటారు. వ్యతిరేకించే వారుంటారు. అలాంటిది.. శాంతి భద్రతల సమస్యలు తెలెత్తుతాయంటూ పోలీసులు అక్రమంగా కేసులు బనాయిస్తూ వస్తున్నారు. నేరం రుజువైతే ఏడేండ్ల కంటే తక్కువ శిక్షలు పడే అవకాశాలున్న సెక్షన్ల కింద కేసు నమోదు చేసినప్పుడు పోలీస్‌స్టేషన్‌లోనే నిందితులకు బెయిల్ ఇవ్వాలని సుప్రీం కోర్టు ఉత్తర్వులున్నాయి. అయినా కూడా సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టిన వారిని అరెస్ట్ చేసి జైలుకు పంపించాలంటూ సైబర్‌క్రైమ్ పోలీసులు శతవిధాలా ప్రయత్నిస్తుంటారు. ఈ ప్రయత్నంలో భాగంగానే గతంలో పలువురిని అరెస్ట్ చేసి కోర్టులకు తీసుకెళ్లినప్పుడు 41 సీఆర్‌పీసీ కింద నోటీసులు ఇచ్చేందుకు అవకాశమున్నా, ఎందుకు అరెస్ట్ చేశారంటూ కోర్టులు పోలీసులకు మొట్టికాయలు వేసిన ఘటనలు ఉన్నాయి. అయితే, సోషల్‌మీడియాకు సంబంధించిన సాధారణ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తే కోర్టులు రిమాండ్‌కు ఆదేశించడంలేదని పోలీసులు మరో అడుగు ముందుకేస్తున్నారు.

మరిన్ని కేసులు నమోదు చేస్తూ!

ఒక కేసులో 41 సీఆర్‌పీసీ నోటీసులు తీసుకున్న నిందితుడు మరోసారి సోషల్‌మీడియాలో పోస్టు పెట్టినా, సదరు వ్యక్తికి సంబంధించిన వారు పోస్టులు పెట్టినా, సంస్థలు పోస్టులు పెట్టినా మరో కేసు వెంటనే నమోదు చేస్తున్నారు. ఇలా రెండు మూడు కేసులు నమోదు చేస్తే రిపీటెడ్ అఫెన్స్‌లు చేస్తున్నాడని కోర్టుకు చెప్పేందుకు అవకాశముంటుందని, ఆ సెక్షన్ కూడా అదనంగా జోడిస్తున్నారు. వీటితో పాటు ఎలక్ట్రానిక్ రికార్డ్స్‌ను ట్యాంపర్ చేస్తున్నారని, కుట్రలు ఉన్నాయంటూ లేనిపోని సెక్షన్లను జోడిస్తున్నారు. ఎలాగైనా తమ మాట వినని వారిని జైల్లో పెట్టి నిర్బంధించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అన్ని అంశాలను కోర్టులు పరిగణలోకి తీసుకుంటూ పోలీసుల చర్యలను గమనిస్తూ తీర్పులు వెల్లడిస్తున్నాయి. సోమవారం డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్ రెడ్డిని సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయనను అరెస్ట్ చేసేందుకు గతంలో ప్రయత్నించిన హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు విఫలమయ్యారు. ఇది జీర్ణించుకొని పోలీసులు.. ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసిన సెక్షన్లను కాదని దర్యాప్తులో కొత్త విషయాలు వెల్లడయ్యాయంటూ.. రిమాండ్ విధించేలా సెక్షన్లను జోడించి అరెస్ట్ చేశారు. అయినా, కోర్టు రిమాండ్‌ను తిరస్కరించిన విషయం తెలిసిందే. సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టేవారిని నిర్బంధించి, ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను ప్రజలకు తెలియకుండా పోలీసులు తమవంతు ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. పోలీసులు చట్ట ప్రకారం నడుచుకోవాలి. తప్పు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలి. ప్రభుత్వ పెద్దలు, బాస్‌ల మెప్పుకోసం అక్రమ కేసులు బనాయించవద్దంటూ సామాన్య ప్రజలు కోరుతున్నారు

ఇంట్రా ఆపరేటివ్ అల్ట్రా సౌండ్ కోర్సుపై వర్క్‌షాప్

ఖైరతాబాద్, నవంబర్ 19: ఇంటర్నేషనల్ హెపటో పాంక్రియాటికో బైలరీ అసోసియేషన్, నిమ్స్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం సంయుక్తాధ్వర్యంలో మంగళవారం ఇంట్రా ఆపరేటివ్ అల్ట్రా సౌండ్ కోర్సుపై అవగాహన, హ్యాండ్ వర్క్ షాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఇండో అమెరికన్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వర్, యునైటెడ్ కింగ్‌డం ప్లై మోత్ యూనివర్సిటీకి చెందిన హెపటోప్రాంక్రియాటికో బైలరీ సర్జన్ ప్రొఫెసర్ సోమయ్య ఆరూరీ, నిమ్స్ డైరెక్టర్, అసోసియేషన్ ఆర్గనైజింగ్ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ నగరి బీరప్ప, డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. సాధారణ అల్ట్రా సౌండ్ ద్వారా పూర్తి స్థాయిలో సమస్యను తెలుసుకోలేమని, కాలేయం, ఉదర భాగంలో ఉన్న ట్యూమర్స్, గడ్డలను తొలగించేందుకు ఇంట్రా ఆపరేటివ్ అల్ట్రా సౌండ్ ద్వారా అవయవాలు దెబ్బతినకుండా తొలగించవచ్చని వైద్యులు తెలిపారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో ఈ ఆధునిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందని, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ సర్జన్లకు దీనిపై శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శులు డాక్టర్ టి. వేణుమాధవ్, డాక్టర్ సూర్యరామచంద్ర, సహాయ కార్యదర్శులు డాక్టర్ కె. నవకిశోర్, డాక్టర్ ఎం.ఆధితి పాల్గొన్నారు.

ప్రొఫెసర్ కాశింను సన్మానించిన వంగపల్లి

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 19: ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ కాశింను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో విద్యార్థి నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వంగపల్లి మాట్లాడుతూ.. ఆర్ట్స్ కళాశాల చరిత్రలో తొలి మాదిగ ప్రొఫెసర్‌గా చిరస్థాయిగా నిలిచిపోతారని చెప్పారు. ఒక సాధారణ పల్లెటూరి పశువులు కాసే పిల్లగాడి స్థాయి నుంచి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎదిగిన కాశింను సన్మానించడం గర్వంగా ఉన్నదన్నారు. దళిత, వామపక్ష, స్త్రీ విప్లవోద్యమం నుంచి ప్రత్యేక తెలంగాణ సాధన వరకు అనేక భావ సంఘర్షణలకు నిలయం ఓయూ అని గుర్తు చేశారు. అలాంటి ఘన చరిత్ర కలిగిన ఆర్ట్స్ కళాశాలకు మాదిగ బిడ్డ ప్రిన్సిపాల్ కావడం సంతోషకరమంటూ.. కాశింతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరి వెంకట్, కార్యనిర్వాహక అధ్యక్షుడు వరిగడ్డి చందు, నాయకులు నాగరాజు, రాజేశ్ ఖన్నా, చింతం తిరుపతి, జన్నారపు జీవన్, గుమ్మడిల్లి తిరుమలేశ్, కానుగంటి సురేశ్, వెంపటి శ్రీకాంత్, మణి, ఫణి తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ కాశింకు శుభాకాంక్షలు తెలుపుతున్న వంగపల్లి శ్రీనివాస్, ఎంఎస్ఎఫ్ నాయకులు

ఉస్మానియాలో పందికొక్కుల సంచారం!

సామాజిక మాధ్యమాల్లో వైరల్

ఆకస్మికంగా పర్యటించిన వైద్య శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

ఆ వీడియో పాతదన్న సూపరింటెండెంట్ డాక్టర్ రాఖేశ్ సహాయ్

సుల్తాన్‌బజార్, నవంబర్ 19: ఉస్మానియా దవాఖానలో పందికొక్కుల సంచారం.. అంటూ పలు సామాజిక మాధ్యమాలలో వస్తున్న వీడియో వైరల్‌గా మారింది. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ మంగళవారం దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు దవాఖాన క్యాజువాల్టీలో దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాఖేశ్ సహాయ్‌తో కలిసి పర్యవేక్షించి, స్వయంగా రోగులతో మాట్లాడారు. అక్కడ అందుతున్న వైద్య సేవల పట్ల ఆరా తీశారు. దవాఖానలో కొనసాగుతున్న పారిశుధ్యం, పరిశుభ్రత, రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు సెక్యూరిటీ, పారిశుధ్య విభాగం సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలను జారీ చేయాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. వాస్తవాలు తెలుసుకోకుండా సామాజిక మాధ్యమాలలో దవాఖాన ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా ప్రయత్నించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన ఉస్మానియాలో పందికొక్కుల సంచారం.. అనే వీడియో పాతదని, గతంలో తీసిన పాత వీడియోలను యూట్యూబ్ ఛానల్‌లో ప్రసారం చేశారని సూపరింటెండెంట్ డాక్టర్ రాఖేశ్ సహాయ్ తెలిపారు. క్షేత్ర స్థాయిలో వివరాలను తెలుసుకొని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు.

జర్నలిస్టుపై రియల్టర్ల దాడి

బండబూతులు తిడుతూ..

అధికారుల ఎదుటే చేయి చేసుకున్న మూకలు

పోలీసులకు ఫిర్యాదు చేసిన జర్నలిస్టులు

దుండిగల్, నవంబర్ 19 : తమ సంస్థపై వరుస కథనాలు రాశారనే నెపంతో అక్రమార్కులు ఓ పత్రిక విలేకరిపై దాడికి తెగబడ్డారు. నీవు ఎలా రాస్తావంటూ.. రాయలేని భాషలో బండబూతులు తిడుతూ విలేకరిని చుట్టుముట్టారు. ఆగ్రహంతో ఊగిపోతూ మండల తాసీల్దార్, ఇరిగేషన్ అధికారుల ఎదుటే చేయి చేసుకున్నారు. ఈ ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాధిత జర్నలిస్ట్ రాయపురి మద్దయ్య కథనం ప్రకారం.. బౌరంపేట, డీ.పోచంపల్లి సరిహద్దులో నిర్మిస్తున్న త్రిపుర ల్యాండ్ మార్క్– 4,5 వెంచర్లల్లో అక్రమాలు ఉన్నాయని, అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయంటూ దిశ పత్రికలో గత రెండు రోజులుగా వార్తలు ప్రచురితమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం రెవెన్యూ అధికారులు తాసీల్దార్ సయ్యద్ మాతిన్, సర్వేయర్ రూప, ఆర్ఐ అన్వేశ్, ఇరిగేషన్ ఏఈ స్వప్న తదితరులు సదరు వెంచర్ పరిశీలనకు వెళ్లారు. వీరి వెంట దిశ విలేకరి మద్దయ్య, ప్రజాపక్షం విలేకరి సెంతన్ కుమార్, అక్షిత విలేకరి యాకుబ్ పాషా కలిసి వార్త సేకరణకు వెళ్లారు. అక్కడ దిశ విలేకరి మద్దయ్యను చూడగానే త్రిపుర ల్యాండ్ మార్క్ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సుధాకర్, స్థానికులైన వంపుగూడెం బాల్‌రెడ్డి, చిన్నారెడ్డి, వంపుగూడెం భూపాల్‌రెడ్డి సహా మరో 10 మంది కలిసి మద్దయ్యపై మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. సుమారు 12 మంది రాయలేని భాషలో అసభ్య పదజాలంతోదూషిస్తూ, నువ్వు విలేకరైతే ఏంటీ, మా మీదనే వార్తలు రాస్తావా.. అంటూ దుండిగల్ తాసీల్దార్ మతిన్ కండ్ల ముందరే భౌతిక దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితుడితో కలిసి పలువురు జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల నేతలు దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో దిశ మేడ్చల్ జిల్లా రిపోర్టర్ రవిచంద్ర, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సాయిబాబా, టీయూడబ్ల్యూజే(హెచ్–143) కుత్బుల్లాపూర్ మాజీ అధ్యక్షుడు కొలెపాక వెంకట్, సిటీటైమ్స్ సీఎండీ రామకృష్ణారెడ్డి, దిశ కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి లింగస్వామి, జర్నలిస్టులు రణదేవ్, పాషా, సెంతన్‌కుమార్, దత్తు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘాల నేతలు, జర్నలిస్టులు మాట్లాడుతూ.. మద్దయ్యపై దాడికి పాల్పడిన త్రిపుర ల్యాండ్ మార్క్ సుధాకర్‌రెడ్డితో సహా ఇతరులపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైఎంసీఏ 100 ఏండ్ల మూమెంట్‌ను పురస్కరించుకుని భారత బాస్కెట్ బాల్‌కు చేసిన కృషికి మాజీ కెప్టెన్‌లు గీతూఅన్నాజోస్, అనితా పాల్ దురైని మంగళవారం హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎంసీఏ ప్రతినిధులు నార్మన్ ఇసాక్, ఎగ్యున్ జార్జ్, పీటర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

షేక్ అఫ్రిదీ సెంచరీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో జరిగిన హెచ్‌సీఏ 'సీ' డివిజన్ వన్డే లీగ్‌లో హైదరాబాద్ వాండరర్స్ ప్లేయర్ షేక్ అఫ్రిదీ (84 బంతుల్లో 106, 17ఫోర్లు, సిక్స్) సెంచరీతో విజృంభించాడు. రంగారెడ్డి జిల్లా నిర్దేశించిన 237 పరుగుల లక్ష్యాన్ని వాండరర్స్ టీమ్ 34 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి విజయాన్నందుకుంది. రంగారెడ్డి బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ అఫ్రిదీ సెంచరీతో జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించాడు. అఫ్రిదీకి తోడు తమీమ్ (50) ఆకట్టుకున్నాడు. తొలుత చేతన్(72 నాటౌట్), సాయివర్ధన్(73) రాణించడంతో రంగారెడ్డి జట్టు 45 ఓవర్లలో 236/5 స్కోరు చేసింది.

డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

స్థలం కేటాయింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి

డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నేడు సంతకాల సేకరణ

బంజారాహిల్స్, నవంబర్ 19: జూబ్లీహిల్స్‌లోని డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన 10 ఎకరాల స్థలాన్ని జేఎన్ఏఎఫ్ఏయూకు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం యూనివర్సిటీ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని జేఏసీ చైర్మన్ ప్రొ.పల్లవీ కాట్జే, కన్వీనర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం యూనివర్సిటీ ప్రాంగణంలో ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని కొనసాగించారు. సుదీర్ఘ చరిత్ర కలిగిన డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ భవిష్యత్తును దెబ్బతీసేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేలా బుధవారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు డా.వేణుగోపాల్‌రెడ్డి, డా. ఎల్వీకే. రెడ్డి, డా.బానోత్ ధర్మ, డా.రజిత, డా. అవినాశ్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లాట్‌ను రెంట్‌కు ఇస్తానని మోసం

18 మంది నుంచి రూ.5లక్షలు వసూలు

నిందితుడిని అరెస్ట్ చేసిన బాచుపల్లి పోలీసులు

శివశంకర్

దుండిగల్,నవంబర్19: ఫ్లాట్‌ను అద్దెకు ఇస్తానని ఆన్‌లైన్ యాప్‌లో పెట్టి మోసాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని బాచుపల్లి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ కథనం ప్రకారం.. పట్నం శివశంకర్‌కు నిజాంపేటలోని బండారీ లే అవుట్ కాలనీలోని పాండురంగా ఆర్కడే అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ ఉంది. ఇందులో శివశంకర్‌తో పాటు అతడి భార్య మాధవి, అల్లుడు లోకేశ్ ఉంటున్నారు. సులభంగా డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశంతో.. తాము ఉంటున్న ఫ్లాట్‌ను అద్దెకు ఇస్తామంటూ సోషల్ మీడియాలో ప్రకటన ఇచ్చారు. దీంతో పలువురు వీరిని సంప్రదించగా.. వారి నుంచి అడ్వాన్స్‌గా డబ్బులు తీసుకున్నారు. ఈ విధంగా 18 మంది నుంచి సుమారు రూ.5లక్షల వరకు వసూలు చేశారు. అయితే, ఫ్లాట్‌ను ఎవరికీ అప్పగించకపోవడంతో శివశంకర్ చేతిలో మోసపోయామని గ్రహించిన ఓ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు శివశంకర్‌ను మంగళవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

22న మాదాపూర్‌లో డ్రోన్లపై నిషేధం

సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి

సిటీబ్యూరో, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము నగర పర్యటన నేపథ్యంలో ఈ నెల 22వ తేదీన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫ్లయింగ్ జోన్‌పై ఆంక్షలు విధిస్తున్నట్లు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి వెల్లడించారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ 2019, మే 10న జారీ చేసిన ఆదేశాల మేరకు నిషేధం విధించినట్టు పేర్కొన్నారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రోన్లు, పారాగ్లైడర్స్, లాట్ ఎయిర్ క్రాఫ్ట్స్ వంటివి గాలిలోకి ఎగురవేయకుండా ఆంక్షలు విధిస్తున్నట్లు సీపీ తెలిపారు. ఈ ఆంక్షలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

200 క్వింటాళ్ల బియ్యం, వాహనాలు స్వాధీనం

మన్సూరాబాద్, నవంబర్ 19: రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న కేసులో ముగ్గురిని ఎల్బీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. గోల్కొండకు చెందిన సయ్యద్ ఫయాజ్ (35) వ్యాపారి. బాలాపూర్, కొత్తపేటకు చెందిన సర్వర్ అహ్మద్‌ఖాన్ (45) డ్రైవర్. నాందేడ్‌కు చెందిన సూర్యవంశీ జీవన్ (33) లారీ డ్రైవర్. సయ్యద్ ఫయాజ్ టీకేఆర్ కమాన్, మీర్‌పేట, సరూర్‌నగర్, కర్మన్‌ఘాట్, ఎల్బీనగర్, చైతన్యపురిలో పలువురి వద్ద నుంచి కిలోకు రూ.15ల చొప్పున రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నాడు. ఆ బియ్యం జహీరాబాద్‌కు తరలించి నవీద్ అనే వ్యక్తికి కిలోకు రూ. 20ల చొప్పున విక్రయిస్తున్నాడు. పలు ప్రాంతాల నుంచి సేకరించిన రేషన్ బియ్యంను శ్రీనివాసకాలనీలోని రెండు షట్టర్లలో నిల్వ చేస్తున్నాడు. ఈ బియ్యం లారీలో జహీరాబాద్‌కు తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. ఈ మేరకు సోమవారం అర్ధరాత్రి లారీలో లోడ్ చేసిన 200 క్వింటాళ్ల రేషన్ బియ్యం, లారీ, టాటా ఏస్ గూడ్స్ వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన సయ్యద్ ఫయాజ్‌తో పాటు లారీ యజమాని సూర్య వంశీ జీవన్, డ్రైవర్ సర్వర్ అహ్మద్‌ఖాన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PEST CONTROL

★చెదలు, బొద్దింకలు నివారణ: న్యూ కన్‌స్ట్రక్షన్ ట్రీట్‌మెంట్ 10 సంవత్సరాల గ్యారెంటీ మరియు శానిటైజర్ స్ప్రే కొరకు సంప్ర: 9392468282, 8333030227. NT-335868

GOLD FINANCE

★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739. NT-336601

★SLNS Jewellary Work: అన్ని బ్యాంకులు మరియు Pvt. Finance కంపెనీలలోని మీ Gold విడిపించి, ప్రస్తుత మార్కెట్ ధరకు కొనబడును. Ph: 6309617426. NT-339397

OLD AGE HOME

★వృద్ధులు, NRI's విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్, ఉప్పల్ & ECIL - కీసర రోడ్, చీర్యాల్ 'X' రోడ్, భోజన వసతితో. సంప్ర: 7981467036, 9391039990, 8074327715. NT-339312

PLOT FOR SALE

★నాగార్జున సాగర్ హైవే యాచారం టౌన్‌లో గజం. రూ. 8,990/-, DTCP అప్రూవ్డ్ లేఅవుట్‌లో & కడ్తాల్ మైసిగండి దగ్గర గజం: 9,990/-. స్పాట్ రిజిస్ట్రేషన్, 25% పేమెంట్ చేసిన వారికి 500 గ్రా. సిల్వర్ ఫ్రీ. ఫోన్: 9014297729. NT-339388

★శరవేగంగా అభివృద్ధి చెందుత